

జైనూర్ రైతు ఉత్పత్తి సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## ఉత్పత్తి సంఘాలతో ఆర్థికాభివృద్ధికి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

జైనూర్, జనవరి 18 : రైతు ఉత్పత్తి సంఘాలు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతాయని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శనివారం ఉట్నూరు ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ట్రైకార్ మొదటి దశ చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ట్రైకార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన, రైతు ఉత్పత్తి సంఘాలకు మొదటి దశ రాయితీగా ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ. 7.50 లక్షల చొప్పున విడుదల అయ్యాయని, వాటిని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞాశీల్, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.



మంచిర్యాలలో నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నస్పూర్, జనవరి 18 : జిల్లాలో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మంచిర్యాల, లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1383 మంది విద్యార్థులకు గాను 1090మంది హాజరు కాగా 293 మంది గైర్హాజరయ్యారు.
కాగజ్‌నగర్, జనవరి 18: కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ కేంద్రాల్లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 1159 మంది విద్యార్థులు 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకోగా, 805 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పార్వతి స్పష్టం చేశారు.

## సింగరేణి భూముల పరిరక్షణకు కృషి

సీసీసీ నస్పూర్, జనవరి 18: సింగరేణి భూముల పరిరక్షణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎం నలజాల రాధాకృష్ణ సూచించారు. శనివారం సీసీసీ సింగరేణి అతిథి గృహంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణతో కలిసి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఎస్టేట్ అధికారులతో భూములకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఎస్టేట్స్ అధికారులతో ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రోజు రోజుకూ భూముల విలువ పెరిగిపోతుందని, ఈ క్రమంలో సింగరేణి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు సంబంధించిన అటవీ, రెవెన్యూ, సింగరేణి భూములపై జీఎం సూర్యనారాయణ కలిసి, ఎస్టేట్ అధికారులతో కూలంకుషంగా చర్చించారు. భూముల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. తమ ఆధీనంలో ఉన్న భూముల హద్దులను స్పష్టంగా గుర్తుండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మందమర్రి, బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్ అధికారులతో నలజాల రాధాకృష్ణ చర్చించారు. ఈ సమావేశంలో ఎస్టేట్స్ అధికారులు వరలక్ష్మి, మహేశ్, సురేశ్, శ్రీనివాస్, స్వప్న, పీ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

## కాంట్రాక్టు కార్మికుల సమ్మె విజయవంతం

జైపూర్, జనవరి 18: జైపూర్ సింగరేణి విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టు కార్మికులు శనివారం తలపెట్టిన ఒక్కరోజు సమ్మె విజయవంతమైంది. కార్మికులు విధులు బహిష్కరించి ఎస్టీపీపీ గేటు ఎదుట నిరసన చేపట్టారు. మూడు షిఫ్టుల్లో ఉన్న సమారు వెయ్యి మంది కార్మికులు విధులు బహిష్కరించారు. పోలీసులు అక్కడికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని వెళ్తున్న కార్మికులను సీఐఎస్ఎఫ్ పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అవుట్‌పాస్ కావాలని సీఐఎస్ఎఫ్ సిబ్బంది కార్మికులను ఇబ్బంది పెట్టినట్లు తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి షిఫ్టు కార్మికులను బయటకు పంపించారు.

### కాంట్రాక్టు కార్మికులకు హెచ్ఎంఎస్ యూనియన్ మద్దతు

పవర్‌ప్లాంటు నిర్మాణంతో జైపూర్, గంగిపెల్లి, ఎల్కంటి, పెగడపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ విలువైన భూములు కోల్పోయారని వారికి సరైన వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒక్కరోజు టోకెన్ సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు. ఎన్టీపీసీ మాదిరిగా కార్మికులకు రూ.5 వేల బోనస్ ఇవ్వాలని, నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని యజమాన్యాన్ని హెచ్చరించారు.

## మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మందమర్రి, జనవరి 18: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని పాలక వర్గం లేక మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడుతున్నదని అడపాదడప జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత కొరవడుతోందని రాజకీయ పార్టీల జేఏసీ నాయకులు అన్నారు. పట్టణానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు శనివారం మున్సిపాలిటీకి ఎన్నికల సాధన కొరకు పొలిటికల్(అఖిల పక్ష) జేఏసీని ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పొలిటికల్ జేఏసీ నాయకులు అందుగుల శ్రీనివాస్, మేడిపల్లి సంపత్, ఓ.రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, బండారు సూరిబాబు, ఎండీ.అబ్బాస్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేంత వరకు జేఏసీ ఆద్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మందమర్రిని మున్సిపాలిటీగా ప్రకటించి దశాబ్దాలు గడుస్తున్న పాలక వర్గం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం, పాల్వంచ, ఆసిఫాబాద్‌లో చేసిన విధంగా మందమర్రిలో కూడా మున్సిపాలిటీ పరిధి నుంచి ఊరు మందమర్రి, నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్‌లను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి పట్టణ ప్రాంతమైన మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు కొరకు అవసరమైతే కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాను కలసి విన్నవిస్తామన్నారు. దశల వారీ కార్యక్రమాలలో బాగంగా ముందుగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లకు వినతి పత్రాలను సమర్పించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో అఖిల పక్ష జేఏసీ నాయకులు మద్ది శంకర్, బర్ల సదానందం, భూపెల్లి కనకయ్య, భట్టు రాజ్ కుమార్, ముల్కల రాజేంద్ర ప్రసాద్, ఆర్.వెంకన్న, ఆర్.జనార్ధన్, ఎండి.రసూల్, మాయ రమేశ్, సురేశ్ కుమార్, యాదగిరి రాజేంద్ర ప్రసాద్, బాలాజి, రంగు శ్రీను, వెంకటాచారి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.








